క్లుప్తంగా

ఉపాధిహామీ పనులపై సమీక్ష



రేగొండ: ఉపాధిహామీ పథకం కింద మండలంలోని అన్ని గ్రామాల్లో కూలీలకు పనులు కల్పించాలని ఎంపీడీఓ సురేందర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లతో సోమవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో 50 మందికి తక్కువ కాకుండా ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. చేసిన పనులకు సకాలంలో డబ్బులు చెల్లించడానికి మస్టర్స్‌ను వెంటనే మండల పరిషత్ కార్యాలయంలో అందించాలని పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. పనులు కోరిన ప్రతి కుటుంబానికి వంద రోజుల పనిని కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ జమీర్, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

11న వాహనాల వేలం

కాటారం: కాటారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ దాడుల్లో పట్టుబడిన వాహనాలను జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు ఈ నెల 11న కాటారం ఎక్సైజ్ కార్యాలయంలో వేలం వేయనున్నట్లు సీఐ ప్రశాంతి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.వాహనాల వేలంలో పాల్గొనాలనుకునే ఆసక్తిగల వారు వివరాల కోసం కాటారం ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

మండల కమిటీ ఎన్నిక



మంగపేట: ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని జిల్లా నాయకుడు మడిపెల్లి శ్యామ్ ఆధ్వర్యంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మల్లూరు గ్రామానికి చెందిన వల్లె పోగు రాము, అధికార ప్రతినిధిగా ఎల్‌పీ రామకృష్ణను ఎన్నుకున్నారు. అలాగే ఎంఎస్పీ మండల అధ్యక్షుడిగా గుగ్గిళ్ల సురేష్, అధికార ప్రతినిధిగా ఎల్‌పీ కిరణ్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల సీనియర్ నాయకుడు ఎంపెల్లి సమ్మయ్య, నైనారపు రాజు, ఈసంపెల్లి సురేందర్, కిరణ్, ఎంపెల్లి వీరస్వామి, పెద్ద శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీకి తప్పని తిప్పలు



బారులుదీరిన వినియోగదారులు

వెంకటాపురం(కె): మండలంలోని గ్యాస్ వినియోగదారులకు ఈ-కేవైసీ కోసం తిప్పలు తప్పడం లేదు. 18 గ్రామ పంచాయతీల్లోని వినియోగదారులు ఈ కేవైసీ చేయించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం గ్యాస్ వినియోగదారులు తప్పనిసరిగా ఈ కేవైసీ చేయించుకోవాలని తెలపడంతో సోమవారం ఏజెన్సీల ముందు క్యూ కట్టారు.

డాక్టర్లు లేక అవస్థలు!

50 పడకల సివిల్ ఆస్పత్రిలో 18 మందికి నలుగురే దిక్కు

- ఇద్దరు రెగ్యులర్, ఇద్దరు కాంట్రాక్ట్ వైద్యులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

అది జిల్లాలోనే పేరుగాంచిన ఆస్పత్రి. రాష్ట్ర స్థాయిలో అవార్డు అందుకున్న ఘనత ఆ ఆస్పత్రి సొంతం. కాని, ప్రస్తుతం నలుగురు డాక్టర్లతో నారాయణ అంటూ కాలం వెళ్లదీస్తున్న పరిస్థితి చిట్యాల సివిల్ ఆస్పత్రిలో నెలకొంది. అన్ని హంగులతో కూడిన గదులు, అన్నిరకాల సదుపాయాలు కలిగి అన్నీ ఉన్నా వైద్యులు లేకపోవడంతో వెలవెలబోతుంది. – చిట్యాల



అన్ని హంగులతో ఉన్న సివిల్ ఆస్పత్రి

మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు లేక రోగులు అవస్థలు పడుతున్నారు. గతంలో సామాజిక ఆరోగ్య కేంద్రం 30 పడకల ఆస్పత్రి నుంచి 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. కాని దానికి సంబంధించిన వైద్య సిబ్బందిని నియమించక పోవడంతో ఈ ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు. మారుమూల ప్రాంతానికి ఎంజీఎం లాగా ఉన్న ఈ సివిల్ ఆస్పత్రికి వైద్యులు ఎవరూ రావడం లేరు. గతంలో ఎన్నిమార్లు జిల్లా అధికారులకు తెలిపిన కనీసం పట్టించుకునే నాథుడే కరువయ్యారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

18 మంది వైద్యులకు నలుగురు మాత్రమే..

50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసినప్పుడు 18 మంది వైద్యులను నియమించాలి. అందులో సూపరింటెండెంట్, సివిల్ సర్జన్, నలుగురు డిప్యూటీ సివిల్ సర్జన్, ముగ్గురు గైనాకాలాజిస్టులు, ఇద్దరు పిల్లల డాక్టర్లు, డెంటిస్ట్, జనరల్ మెడిసిన్ వైద్యుడు, జనరల్ సర్జన్, ఇద్దరు మత్తు వైద్యులు, ఇద్దరు జనరల్ వైద్యులు ఉండాలి. కాని వైద్యులను నియమించక పోవడంతో ఆస్పత్రికి ప్రస్తుతం నాలుగురు వైద్యులు మాత్రమే వస్తున్నారు. అందులో ఇద్దరు రెగ్యులర్, ఇద్దరు కాంట్రాక్ట్ వైద్యులు ఉన్నారు.

పట్టణాలకు వెళ్తున్న రోగులు..

ఏదైనా రోగం వస్తే ప్రథమ చికిత్స కోసం స్థానిక ఆస్పత్రికి వెళ్లి చూపించుకోవాలి. కాని అలా కాకుండా సరైన వైద్యులు లేక పోవడంతో రోగులు పట్టణాలకు వెళ్లి అక్కడే చూపించుకుంటూ చికిత్స చేయించుకుంటున్నారు. దీంతో వారికి ఆర్థిక భారం పడుతోంది. గైనాకాలాజిస్ట్ వైద్యురాలు లేక పోవడంతో ఉన్న వైద్య సిబ్బంది గర్భిణులను చూసి వారిని జిల్లా కేంద్రంలో ఉన్న ఆస్పత్రికి పంపిస్తున్నారు. దీంతో ఇంత పెద్ద ఆస్పత్రికి డాక్టర్లు లేకపోవడం ఎంటని పలువురు గర్భిణులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా, అధికారులు, స్థానిక ఎమ్మెల్యే స్పందించి చిట్యాల సివిల్ ఆస్పత్రిలో వైద్యులను నియమించాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారంలో విఫలం

- మండల సభలో అధికారులపై సభ్యుల ఆగ్రహం



పథకాలను వివరిస్తున్న ఏపీ కల్యాణి

వెంకటాపురం(ఎం): ప్రతీ మూడు నెలలకోకసారి నిర్వహించే మండల సభలో ప్రజల సమస్యలు పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకవెళ్తున్నప్పటికీ వాటిని పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారని మండల సభలో ఎంపీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బుర్ర రజిత అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి జెడ్పీటీసీ గై రుద్రమదేవి హాజరయ్యారు. సభ ప్రారంభంలోనే సభ్యులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల సభకు పూర్తిస్థాయిలో అధికారులు హాజరుకావడం లేదని, సభకు గైర్హాజర్ అయిన అధికారులపై చర్యలు తీసుకోవాలని గతంలో పలుమార్లు తీర్మానాలు చేసినప్పటికీ ఇప్పటి వరకు ఒక్క అధికారిపై కూడా చర్యలు తీసుకోలేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎంపీటీసీ సభ్యులు పోశాల అనిత, జాహీర్‌పాషా అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. రామప్ప సరస్సు కింద కాల్వల్లో పిచ్చిమొక్కలు పెరిగి చెత్తాచెదారం నెలకొన్నందున చివరి ఆయకట్టు పొలాలకు సాగు నీరు అందడం లేదని, కాలువలకు మరమ్మతులు చేపట్టాలని సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల సభకు హాజరైన అధికారులు వారి శాఖల తరఫున చేపడుతున్న అభివృద్ధి పనులను సభ్యులకు వివరించారు. మండల పరిధిలో 23 మంది సర్పంచ్‌లు ఉన్నప్పటికీ కేవలం ఐదుగురు సర్పంచ్‌లు మాత్రమే మండల సభకు హాజరు కావడం గమనార్హం. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

హాస్టల్ తెరవాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: ఆజాంనగర్ గ్రామంలో మూసి ఉన్న ఎస్సీ హాస్టల్ భవనాన్ని తెరిపించి ఉపయోగంలోకి తీసుకురావాలని ఆమ్‌ఆద్మీపార్టీ యువజన విభాగం జిల్లా కన్వీనర్ కొండ్రసాయి తేజ, ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాన్ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ భవేష్‌మిశ్రాకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కోట్ల రూపాయలతో నిర్మించిన హాస్టల్‌ను 9 సంవత్సరాల క్రితం మూసివేశారని దీంతో పక్కనే ఉన్న ఉన్నత పాఠశాల విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మూసివేసిన హాస్టల్ ప్రారంభించాలన్నారు. లేనట్లయితే ఆ హాస్టల్ భవనంలో మోడల్ స్కూల్‌గా ఏర్పాటు చేసి అటవీ గ్రామాల విద్యార్థులకు ఉపయోగపడే విధంగా చూడాలన్నారు.

స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం



ఏటూరునాగారం: దుస్తులు అందజేస్తున్న సర్పంచ్ రామ్మూర్తి



ఎస్ఎస్ తాడ్వాయి: దుప్పట్లు అందజేస్తున్న సర్పంచ్ గౌరమ్మ

ఎస్ఎస్‌తాడ్వాయి: గ్రేస్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినంనీయమని సర్పంచ్ పుల్లూరి గౌరమ్మ అన్నారు. మండలంలోని కాటాపూర్ గ్రామంలోని వృద్ధులకు, వితంతువులకు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వృద్ధులకు, వితంతువులకు సోమవారం దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. సర్పంచ్ పుల్లూరి గౌరమ్మ చేతుల మీదుగా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఈ దుప్పట్లు, చీరలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. చలి కాలంలో దుప్పట్లు పంపిణీ చేయడంతో వృద్ధులకు ఎంతోగాను ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కంతి ముత్తయ్య, ముర్రం రాజేష్, కంతి లక్ష్మణ్‌రావు, పోడెం నారాయణ, రాంబాబు, వట్టం బాలరాజు, విష్ణు పాల్గొన్నారు.

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని వృద్ధులు, వితంతువులకు గ్రేస్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం సర్పంచ్ ఈసం రామ్మూర్తి దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. మారుమూల ప్రాంతాల్లో నిరుపేదలకు సంస్థ అండగా నిలబడడం సంతోషకరమన్నారు.

వైన్స్‌ను తొలగించాలని ఆందోళన



వైన్స్ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

వెంకటాపురం(ఎం): మండలంలోని లక్ష్మీదేవిపేటలో ఇళ్లమధ్యలో ఉన్న వైన్స్‌ను తొలగించా లని గ్రామస్తులు సోమవారం వైన్స్‌షాపు ఎదుట ఆందోళన చేశారు. సుమారు 150 కుటుంబాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, వైన్స్‌ను వేరే ప్రాంతానికి తరలించాలని ఎక్సైజ్ అధికారులకు చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోయారు. వైన్స్‌ను తొలగించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



చెత్తాచెదారం తొలగిస్తున్న వైద్యసిబ్బంది

వెంకటాపురం(కె): పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటామని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. మండల పరిధిలోని ఎదిర వైద్యశాలలో సోమవారం వైద్యసిబ్బంది, ఆశ వర్కర్లు క్లీన్‌అండ్‌గ్రీన్ కార్యక్రమం వైద్యాధికారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యశాలలోని చెత్తాచెదారాన్ని, పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కరోనా లక్షణాలపై ప్రజలకు వివరించాలని ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఆశవర్కర్లు తదితరులు ఉన్నారు.

'ఆన్‌లైన్' సక్రమంగా చేపట్టాలి



కాటారం: ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ

కాటారం: ప్రజాపాలనలో భాగంగా అభయాస్తం గ్యారంటీ స్కీం అమలు కోసం ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల ఆన్‌లైన్‌ను సక్రమంగా చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, ఎంపీడీఓ శంకర్‌నాయక్ డాటా ఎంట్రీ ఆపరేటర్లకు సూచించారు. మండల కేంద్రంలోని మీసేవా, ఐకేపీ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం, కొత్తపల్లి, అంకుషాపూర్ సీఎస్‌సీ కేంద్రాల్లో కొనసాగుతున్న దరఖాస్తుల ఆన్‌లైన్ విధానాన్ని ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ పరిశీలించారు. ఏ కేంద్రంలో ఎన్ని దరఖాస్తులు ఆన్‌లైన్ చేశారు, ఆన్‌లైన్ కొనసాగుతున్న తీరుపై ఆరా తీశారు. దరఖాస్తుదారుడు ఆర్జీలో పేర్కొన్న ప్రతి అంశాన్ని ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని ఆదేశించారు. ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తగా ఆన్‌లైన్ చేయాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతం చేసి ఇచ్చిన గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. ఎంపీఓ ఉపేంద్రయ్య ఉన్నారు.

డాటా ఎంట్రీని పకడ్బందీగా చేయాలి

మహాముత్తారం: ప్రజాపాలన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను కలెక్టర్ జారి చేసిన ఆదేశాల ప్రకారం డాటా ఎంట్రీని ఆపరేటర్లు పకడ్బందీగా చేయాలని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంతోపాటు మీసేవా, సీఎస్ సెంటర్లలో ఆపరేటర్లు దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే విధానాన్ని పరిశీలించారు. దరఖాస్తుదారుడు నింపిన ఆధారాలను మాత్రమే ఎంట్రి చేయాలని సూచించారు.

డాటా ఎంట్రీపై అవగాహన

మల్హర్: ప్రజాపాలనలో కార్యక్రమంలో భాగంగా స్వీకరించిన ప్రజాపాలన దరఖాస్తుల డాటా ఎంట్రీపై మండలంలోని మీసేవ, ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకులకు మండల ప్రత్యేకాధికారి అవినాష్ సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్ణయించిన గడవులోగా ఎలాంటి తప్పులు లేకుండా పూర్తి అవగాహనతో దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహమూర్తి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రేగొండ: ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ సురేందర్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, మండలంలోని పలు గ్రామాల్లోని మీసేవ కేంద్రాల్లో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా నమోదు ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని ఆపరేటర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణస్వామి, మండల పంచాయతీ అధికారి రాంప్రసాద్ పాల్గొన్నారు.





మహాముత్తారం: డాటా ఎంట్రిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ, మల్హర్: అవగాహన కల్పిస్తున్న అవినాష్

దరఖాస్తుల నమోదు పరిశీలన



పరిశీస్తున్న వరంగల్ ప్రాంతీయ సంచాలకుడు

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మున్సిపల్ కార్యాలయంలో ఆన్‌లైన్ చేస్తున్న ప్రజాపాలన దరఖాస్తుల నమోదును కార్యక్రమాన్ని వరంగల్ ప్రాంతీయ సంచాలకుడు మసుద్ సోమవారం పరిశీలించారు. ఆన్‌లైన్ నమోదు తప్పులు లేకుండా నమోదు చేయాలని సిబ్బందికి తెలిపారు. నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని కమిషనర్ అనిల్‌కు కుమార్‌కు సూచించారు. మున్సిపల్ సిబ్బంది సునీల్ కుమార్, టెక్నికల్ ఆఫీసర్ మానస, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

మంగపేట: తిమ్మంపేటకు చెందిన భుక్య పవన్‌కుమార్ అనే యువకుడికి ఇటీవల రోడ్డు ప్రమాదంలో చేయి విరిగింది. దీంతో బాధితుడికి జ్వాలా యూత్, ట్రస్ట్ అధ్యక్షుడు కోడెల నరేష్ ఆధ్వర్యంలో సోమవారం రూ 13,000 నగదును ఆర్థిక సాయంగా సోమవారం అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన యువకుడికి ఆర్థిక సాయం అందిచేందుకు జ్వాలా యూత్, ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల నుంచి సేకరించిన నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో జ్వాలా యూత్, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి మునిగల రాకేష్, ఉపాధ్యక్షుడు పుల్లంశెట్టి అజయ్, ప్రచార కార్యదర్శి ముప్పారపు రాజు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక మేటల తొలగింపు



కొండాయిలో ఇసుక మేటలను తొలగిస్తున్న దోజర్లు

ఏటూరునాగారం: ఏటూరునాగారం, తాడ్వాయి మండలాల్లోని చెల్పాక, వెంకగళాపురం, కొండాయి, మల్యాల, నార్లాపురం తదితర గ్రామాల్లో గత ఏడాది జూలై నెలలో వచ్చిన వరదకు పంట పొలాల్లో మీటరు ఎత్తుమేర ఇసుక మేటలు వేశాయి. రైతులు ప్రభుత్వానికి ఇసుక మేటలను తొలగించాలని అర్జీ పెట్టుకున్నా ఎలాంటి స్పందన లేదు. దీంతో వృత్తి సేవా సంస్థ ఆధ్వర్యంలో ముంపు ప్రాంతాల్లో పంట పొలాలు ఇసుక మేటలకు గురికావడంతో ఆ ఇసుక మేటలను తొలగించే కార్యక్రమాన్ని సోమవారం చేపట్టింది. కొండాయి, మల్యాల గ్రామాలలోని రైతులు సాగు చేసుకుంటున్నా పంట పొలాలలో ఇసుక కోతకు గురై ఆ రైతుల జీవనాధారం కోల్పోయారు. వృత్తి సేవా సంస్థ దీనిని గమనించి ఎక్సెస్ బ్యాంకు వారి అనుసంధానంతో 15 డోజర్ వాహనాలను ఉపయోగించి పొలాల్లోని ఇసుకను తొలగించారు. రైతులు పంట సాగు చేసుకునే విధంగా తగు ఏర్పాట్లు చేశారు. దీంతో సదురు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వృత్తి సంస్థ మండల ఇన్‌చార్జ్ బాల మహేందర్, ప్రాజెక్టు మేనేజర్ చిన్నప్ప రెడ్డి, విలేజ్ కోఆర్డినేటర్ మోహన్ రావు, సర్వేశ్వరరావు, వేణుగోపాల్, నాగార్జున, శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో పనులు చేస్తూ రైతులకు సాయం అందిస్తున్నారు.

గుడిసెలో సబ్ సెంటర్

- అసంపూర్తిగా నూతన భవనం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



గుడిసెలో కొనసాగుతున్న చెల్పాక సబ్ సెంటర్

ఏటూరునాగారం: మండలంలోని చెల్పాక సబ్ సెంటర్‌కు భవనం లేక గుడిసెలోనే నిర్వహిస్తున్నారు. నూతన భవనం నిర్మిస్తున్న ఇంకా అది పూర్తికాకపోవడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. 2018-19లో ఐటీడీఏ ఇంజనీరింగ్‌శాఖ ద్వారా ట్రైబల్ వెల్ఫేర్ కమిషన్ నుంచి రూ.16లక్షలు సబ్ సెంటర్‌కు నిధులు మంజూరయ్యాయి. ఐటీడీఏ చేపట్టిన టెండర్ల ద్వారా కాంట్రాక్టును దక్కించుకున్న గుత్తేదారుడు వీరాపురంలో నిర్మించాల్సి ఉండగా అక్కడ స్థలం లేదని గ్రామ పొలిమేర అయిన అల్లం వారిఘణపురం స్మశాన వాటికకు దగ్గరగా నిర్మించారు. అదికూడా కేవలం భవనం స్లాబ్, గోడలు పూర్తి కాగా కిటికీలు, డోర్లు ఇంకా అమర్చలేదు. దీంతో భవనం అసంపూర్తిగా మిగిలిపోయింది. మండలంలోని చెల్పాక పీహెచ్‌సీ ఉండడం వల్ల వేరే గ్రామాల ప్రజలకు వైద్య సేవలను అందించాలని ఉద్దేశంతో వీరాపురంలో నిర్మించాల్సి ఉంది. కానీ అక్కడ కాకుండా వీరాపురం-అల్లంవారిఘణపురం మధ్యల స్మశాన వాటిక దగ్గర కట్టిన భవనం ఎందుకు పనికిరాకుండా పోయింది. చుట్టూ చెట్ల పెరిగి అధ్వానంగా మారింది. దీంతో చెల్పాక సబ్ సెంటర్‌ను ఒక గుడిసెను అద్దెకు తీసుకొని నడిపించాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో రోగులకు, వైద్య సిబ్బంది తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులకు ముందు చూపులేక పోవడం, ప్రజాప్రతినిధుల అసమర్థతతో రోగులకు సౌకర్యాలు అరకొరగా అందుతున్నాయి. గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని మంజూరు చేసిన నిధులు చెట్లపొదల పాలవుతున్నాయి. అంతేకాకుండా గత ఏడాది వచ్చిన వరదల్లో సైతం ఈ భవనం పూర్తిగా మునిగిపోవడం గమనార్హం. ఇప్పటికైనా ఇంజనీరింగ్ అధికారులు ఆ భవనాన్ని పూర్తిగా అభివృద్ధి పర్చి సబ్ సెంటర్ సేవలను మరింత మెరుగుపర్చాలని ఆయా గిరిజన గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై వైద్యాధికారి సుమలతను వివరణ కోరగా ఈ భవనం తాను రాకముందు ఉన్న వైద్యాధికారుల సమయంలో నిర్మించారని తెలిపారు. భవనం విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. అసంపూర్తిగా పనులు ప్రారంభించి పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు.



చెట్ల పొదల్లో అసంపూర్తిగా నూతన భవనం

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న సచిన్

మహాముత్తారం: మండలంలోని బోర్లగూడెం చెందిన బోయిని మల్లేష్ కొద్ది రోజులుగా బ్రెన్‌కు సంబంధించిన వ్యాధితో నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చుల నిమిత్తం రాష్ట్ర ఐటీపరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీదర్‌బాబు సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.2లక్షల50వేల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. కాగా శ్రీధర్ బాబు ఆస్పత్రి సహాయకుడు సచిన్ బాధితునికి సోమవారం ఎల్‌ఓసీని హైదరాబాద్‌లో అందజేశాడు.